# డొంకల వంకల మనసులు

నాకు లెక్కలు రావు. అందుకనే చచ్చినవాళ్ళెక్కువ మందో, బ్రతికున్న వాళ్ళెక్కువమందో చెప్పలేను. కొంత మంది సీతారామయ్య పోయాడన్నారు. మరి కొంత మంది సీతారామయ్య కుబుసం వదిలాడన్నారు. "కాదు కాదు చచ్చిపోయిన శీతారామయ్య శరీరంలోకి యెవరో పరకాయ ప్రవేశం చేసివుంటారు" అన్నారు కొందరు. ఎవరేమనుకున్నా శీతారామయ్య మాత్రం బ్రతికున్న వాళ్ళందరికిమల్లేనే తిరుగుతున్నాడు, తింటున్నాడు.

అయితే అతను వినటంలేదనీ, చూడటంలేదనీ, అయినప్పుడు అతను బ్రతికున్నాడని యెట్లా అంటాం అని అడుగుతున్నారు చాలామంది.

చూడగలిగినవాళ్లూ, వినగలవాళ్లూ ఆమాటలంటానికి వీల్లేదు. ఎందుకనంటే నెలకొకసారైనా అతని ఫోటో పత్రికల్లో పడుతోంది. రెండు నెల్ల కొకసారైనా అతను పత్రికల్లో వ్యాసాలు రాస్తున్నాడు. మూడు మాసాలకొకసారైనా ఎవరో వొక గొప్పవాడు శీతారామయ్య గొప్పతనాన్ని గురించి వుపన్యాసమిస్తున్నాడు. ఈ సంగతే నేను మా 'అనూ'తో చెప్పాను.

నా మాట విననట్లుగా చేతిలో పుస్తకం తెరిచి "మాటల అర్థాలు మనుషుల డొంకల వంకల మనసులోబడి

దారితప్పి రూపు చెడి పగటివేషాలతో ప్రత్యక్షమాతున్నాయి" అని గీతం చదివినట్లు చదివింది. మా 'అనూ' రోజూ ఈ సంగతే యేదో వొక రూపంలో పిండి కొట్టినట్లు కొడుతూం టుంది. స్వాతంత్ర్యమూ, ప్రజాస్వామ్యమూ చచ్చిపోయిన హిట్లరు కంపు కొడుతున్నాయట. బ్రతికున్న చర్చిల్ తోక పట్టుకుని గోదావరి ఈదబోతున్నాయట!

నేను కాదసలేదునిజమే! అలాంటి పెద్ద పెద్ద మాటల్ని ఎవళ్ళిష్టం వచ్చినట్లు వాళ్లు వంచుతుంటారు. కాని 'చూడటం, వినటం'— గుడ్డివాడు చూస్తున్నాడనీ, చెవిటివాడు వింటు న్నాడనీ యెంత తెలివితక్కువవాడైనాఅంటాడా! అందుట్లోనూ కళ్లున్న శీతారామయ్య చూడటం లేదంటంలోనూ, చెవు లున్న శీతారామయ్య వినటం లేదంటంలోనూ అర్థం ఏమిటి? ఇలాంటి అర్థంలేని మాట లంటూవుంటుందనె నాకు 'అనూ' అంటే అప్పుడప్పుడు కోపం వస్తుంటుంది.

మీరే చెప్పండి. ఇంకా నిండా ఒక నెలన్నాకాలేదు. శీతారామయ్య హైద్రాబాదు వెళ్లాడు - అంటే నిజం చెప్పా శీతారామయ్యని హైద్రాబాదు పంపించారు. ఆంధ్రరాష్ట్రం వస్తోందిగదా, న్యూ ఢిల్లీలో తాళాలు తీస్తారుగదా, గొళ్ళేలు తీసేలోపుగా మనం యిక్కడ విడిదిల్లయినా అలికి ముగ్గేస్తే బావుందని అనుకునేవాళ్ళలో కొంత మంది వెళ్లి హైద్రా బాదుకీ మనకీవున్న సంబంధాన్ని చూచి రమ్మన్నారు. శీతా రామయ్య వెళ్లాడు. బ్రతకాలనుకున్న వాడెవడైనా హైద్రా బాదంతా కాళ్ళలో తిరగ్గలడా? మీరే చెప్పండి. అందుకనే అతను కారెక్కి వెళ్లాడు; నిజమే! అది అతని సొంతకారు

గాదు. ఆంధ్రులకి అంత గొప్పసేవ చేయబోతున్నవాడిని అలా గౌరవించటం ఆంధ్రుల కర్తవ్యం గాదూ?

మీరే చెప్పండి అలాంటివాడికి కారీయటం లంచమా? అంత మాత్రాన 'శీతారామయ్య కారెక్కాడు!' అని అనటం మాటల అర్థాన్ని పెడదారులు పట్టించటం కాదూ?

హైద్రాబాదు వెళ్లిన తరువాత నవాబు శీతారామయ్యను గౌరవిస్తూ కాక్‌టైల్ పార్టీ యిచ్చాట్ట. నవాబంతటివాడు మనప్రతినిధిని గౌరవించినందుకు గర్వపడలేనివాళ్ళు యెందుకు పనికివస్తారు?

1933లో శీతారామయ్య గాంధీగారి వెనక కాంగ్రెసు జండా పట్టుకుని తిరగలేదా? అంటే తిరిగాడు. హరిజనసేవ చేస్తూ కల్లుపాకలముందు పికెటింగు చేయలేదా? అంతే చేశాడు. అలాంటివాడు యిప్పుడు కాక్‌టైల్ పార్టీకి వెళ్ళ లేదా? అంటే వెళ్లాడు. కాని అతను 1933లో కాదు, వెళ్ళింది 1947లో అని తెలుసుకోవటంకూడా కష్టమేనా ఈ సందులు వెదికేవాళ్ళకి? నీతులు స్థిర సిద్ధాంతాలు కాదనీ, కాలంతో పాటు మారుతుంటాయనీ వాళ్ళే అంటారు. అదే నోటితో శీతారామయ్యని దుయ్యబడుతారు, ఇదెక్కడి న్యాయం?

శీతారామయ్య వరంగల్లుకోటని గురించి వ్రాసిన వ్యాసం చూచిన తర్వాత గూడా అతని ఆంధ్రాభిమానాన్ని శంకించేవాళ్ళని యేమనాలో నా కర్థం కావటం లేదు. కాకతీయుల్ని గురించి అతను వ్రాసిన అక్షరాలు సువర్ణాక్షరాలు

కాదూ? చరిత్రలో మాసిపోని పుటలు చేర్చాడు శీతా రామయ్య. ప్రతాపరుద్రుడి గురించి అతను వ్రాసింది చదువుతూంటే శ్వాస నిలిచిపోతుందే. శరీరం లొంగిపోతుందే, భువనగిరి మట్టికోటని అతను ఉక్కుకోటగా మార్చేశాడే. అలాంటివాడిని పట్టుకుని అతనికి కళ్ళు లేవనీ చెవులు లేవనీ అంటే—!

ఆమాటకొస్తే—అతనికి అంతర్దృష్టి వుందనాలి. ఆ పాడుపడిన కోటల్ని చూచిన తర్వాత అతను మైమరచిపోయాడు. ప్రాచీనాంధ్ర వైభవం అతని కళ్ళముందు కట్టినట్టు కనబడింది. చచ్చిపోయిన రుద్రమదేవిని చూచేందుకు యెన్ని జన్మాల తపస్సు చేయాలి? అది మీకూ నాకూ సాధ్యమౌతుందా ? అతను క్షణకాలం బహిర్ప్రపంచానికి అతీతుడయిపోయాడు. అలాంటి సమాధి దశలోనికి మీరూ నేనూ పోగలమా?

ఆ క్షణకాలంలోనే మాలిక్ గఫర్ చేసిన యుద్ధం కంటేనూ, తుగ్లకు లేపిన తుపానుకంటేనూ ఘోరమైన యుద్ధం జరిగిందట. ఆ పరిస్థితుల్లో తుపాకులు ఫెళ్లుమన్నాయట, చుట్టుప్రక్కల వూళ్ళల్లో ప్రజలు వుప్పెనగా లేచారట.

'విశాలాంధ్ర కావాలి!'...

'నవాబు నాశనం కావాలి!'

'దున్నేవాడిదే భూమి!'

అనే నినాదాలు మిన్ను ముట్టాయట. తెలంగాణా

ప్రజలు నవాబు పోలీసుల్ని తరిమి తరిమి కొట్టారట. ప్రజలు చరిత్రను సృష్టించారట. మధ్య యుగాలకు గోరీకట్టారట. విశాలాంధ్రకు పునాది వేశారట.

ఇవన్నీ శీతారామయ్య చూడలేదట. అలాంటి బహిర్ప్రపంచానికి అతీతుడైనవాడు బ్రతికున్నా చచ్చినవాడితో సమానమట. అలాంటి అంతర్దృష్టి గుడ్డితనమట. ఆ నినాదాలు వినలేనివాడు చెవిటివాడికంటే కనాకష్టమట.

తాజ్ మహాలుని చూచి పరవశమౌతున్న వాళ్ళని శీతారామయ్య 1942 లో విమర్శించలేదా? అంటే విమర్శించాడు. దేశానికి నాలుగుమూలలా చిచ్చంటుకున్నప్పుడు తాజమహాలుని చూచి పరవశులైన వాళ్ళని విమర్శిస్తూ శీతారామయ్య గురజాడని గుర్తుకు తెచ్చాడు.

"దేశమంటే మట్టికాదోయ్

దేశమంటే మనుషులోయ్!"

అని మా వూళ్లో వుపన్యాస మీయలేదా? అంటే యిచ్చాడు. అలాంటివాడు తెలంగాణా నాలుగు మూలలా, లోపలా, బయటా రగులుకున్న చిచ్చును చూడకుండా సమాధిలోకి వెళ్ళి మట్టిగోడల్నీ, గోరీల్నీ చూచి మైమరచిపోవటం మంచిదా అంటే...ఆలోచించాలిసి వుంటుంది. వెనక అంత చరిత్ర వున్నవాడిని పట్టుకుని యిట్టే అనేసేయటం యేమంత సబబు? మీరే చెప్పండి. యిదేమన్నా 19 వందల వలభై రెండా? 1948 గాని. అప్పుడు మనం పరతంత్రులం, యిప్పుడు స్వతంత్రులం!

కాని వీళ్ళు వొప్పుకోరే. హైద్రాబాదుకు స్వతంత్ర్యం లేదట. హైద్రాబాదంటే నవాబు కాదట. హైద్రాబాదంటే హైద్రాబాదు ప్రజలట.

అంతటితో ఆగరు కొంతమంది. ఇతను జాతీయ సాంప్రదాయాన్ని వదిలేశాడంటారు, మన సాంప్రదాయ మంటే ఏమిటో తెలియని వాళ్ళంటారు ఆ మాట. మన సాంప్రదాయం మన మునుల్ని చూస్తే తెలుస్తుంది. వాళ్ళల్లో ఒక్కళ్ళయినా బ్రతికివుంటే శుభ్రంగా ఆయనే చెప్పేవాడు సాంప్రదాయం అంటే యేమిటో. మన సాంప్రదాయం అంటే అంతర్దృష్టి. ముందు మన మెవరమో తెలుసుకోవటం, తర్వాత భగవంతుణ్ణి తెలుసుకోవటం అందుకు సమాధి అవ సరం అని చెప్పకనే తెలుస్తుంది.

మొన్నటిదాకా శీతారామయ్య గాంధీజీ అను చరుడు కాదా? అంటే అనుచరుడే. గాంధీజీ బహిర్ప్రపం చాన్ని చూచి అర్థం చేసుకోవాలని యత్నించలేదా? అంటే యత్నించాడు. ఆయన మన సాంప్రదాయాన్ని ముందుకు తీసుకురాలేదా? అంటే తీసుకొచ్చాడు. శీతారామయ్య దానిని ముందుకు తీసుకుపోనవసరం లేదా? అంటే వుంది. ఐతే ఆయన అడుగుజాడల్లో ముందుకెందుకు నడవడు? అంటే నడుస్తున్నాడు.

కాదట. నడవటం లేదట. గాంధీజీ అహింసా సిద్ధాం తాన్ని గూడా కొంతమంది యిలాగే వ్యాఖ్యానించారట. ప్రజల్ని జైళ్ళలోకుక్కీ, తుపాకుల్తో కాల్చి చంపుతున్న వాళ్ళని అదేమయ్యా అంటే 'గాంధీజీ అహింస మర ఫిరం

గులూ, బాంబరు విమానాలు వున్నవాళ్ళ ముందుగానీ, నిరాయుధుల ముందు కాదు. అహింస వొక రాజకీయపు ఎత్తు' అన్నాడు. ఆ సంగతి గాంధీజీకి చివరిరోజుల్లో తెలిసిందట. పాపం! ఎడ్గర్ స్నో ముందు ఆయన చాలా విచారపడ్డాట్ట, తన అనుచరులమని చెప్పుకునే వాళ్ళని చూచి.

మీరే చెప్పండి. నేనన్నదానికీ, దీనికీ యేమన్నా సంబంధ ముందేమో.

అదేమంటే వ్యక్తిగత విషయాల్లోకి వెడతారు. ఎవరికి లేవు వ్యక్తిగత స్వార్థాలు? కొన్ని కోట్ల వ్యక్తిగత స్వార్థాలు కలవందే, సమిష్టి స్వార్థం యెక్కడనుంచి పుట్టుకొస్తుంది?

కాదట, ఇలా కళ్ళముందు జరిగే పోరాటాన్ని చూడకుండా, చరిత్రని చదవకుండా, వినకుండా, ఒక్క చచ్చిపోయిన చరిత్రను గురించే పోరాటాన్ని గురించే వ్రాస్తూన్నందుకు, అతనికి నెలకి అయిదువేల రూపాయలిస్తున్నారట.

మీరే చెప్పండి. అతను వ్రాస్తున్నందుకేగదా యిస్తున్నారు? అతన్ని కూర్చోపెట్టి మేపటం లేదుగదా? శ్రమ జేస్తున్నాడు. సంపాయించుకొంటున్నాడు. తప్పా? పెళ్లాం బిడ్డల్ని పోషించుకునేందుకు సంపాయించుకోవటం తప్పా?

అంతకు పూర్వం పెళ్లాం బిడ్డల్ని యిలాంటి పాడు సంపాదనతోనే పోషించుకున్నాడా? అంటే ఆ 'పాడు' అనే మాట తీసేయమని, తీసేసిం తర్వాత 'లేదు' అని చెప్పాలి. ఇంతకు పూర్వం యిలాంటి భవనాల్లో బ్రతికాడా? అంటే బ్రతకలేదు. అతని పెళ్లాంబిడ్డలు యిప్పటిలా కార్లు

లోనూ; నగల్లోనూ, సిల్కుగుడ్డల్లోనూ, బ్రతుకు వెళ్ళ బోశారా? అంటే వెళ్ళబొయ్యలేదు.

అసలు యిన్ని ప్రశ్న లెందుకంటాను. ఇంతకు పూర్వం చేయని పని యిప్పుడు చేస్తే తప్పా? సిరిరా మోకాలడ్డిన మూర్ఖుడెవడు? జీవితంలో యాభై మెట్లెక్కిన తర్వాతైనా సుఖమంటే యేమిటో యెరగని మనిషి మనిషా? బాగా బ్రతికితే మరి పదేళ్ళు బ్రతికేను. అల నిష్టం వచ్చినట్టు బ్రతక నీయక యెందుకు చెప్పండి యిట్లా దండెత్తడం? మీరే చెప్పండి ఈ స్వాతంత్ర భారతదేశంలో యెవళ్ళిష్టం వచ్చినట్లు వాళ్లు బ్రతికేందుగ్గూడా వీల్లేదా? ఆ మాత్రం వ్యక్తి స్వాతంత్ర్యం లేదా!

ఈ మాటలే అడిగాను నేను 'అనూ'ని.

కుర్చీలో కూర్చొని వింతగా చూస్తోంది నా వంక. మా అబ్బాయిని చూస్తున్నట్లు చూస్తోంది నన్ను, మాట్లాడ వేం?" అన్నాను.

"ఏమని?" అన్నది అనూ.

"అడిగిందానికి సమాధానం..."

"మీ రడిగిందేం వుంది. మీరు చెబుతూంటే వింటున్నా" అన్నది మళ్ళీ.

నాకు కోపం వచ్చింది.

"ఇంతకీ మీరు శీతారామయ్యగారిని పొగుడు తున్నారా?...వెక్కిరిస్తున్నారా?"

“ఏం, యెందుకు?”

“అబద్ధం ఆడకండీ! మొన్న మన కృష్ణ ఇంటికని బయల్దేరి, మనిల్లుదాటి ఫర్లాంగుదూరం వెళ్ళి సుబ్బయ్యగా రింటిముం దాగితే—మీరేమన్నారో గుర్తుందా? ‘కళ్లు మూసుకుపోయూరా?’ అని వెక్కిరించారు. అప్పుడే మరచిపోయూరా?’ అంది అనూ.

“అన్నాను. అంటే...దానికీ సంబంధం?”

“ఎవళ్ళని వాళ్ళు తెలుసుకోవటం యెంత అవసరమో చుట్టూవున్న ప్రపంచాన్ని తెలుసుకోవటంగూడా అంతే అవసరం. ఇందుట్లో ఏది లేకపోయినా రెండోది వుండదు. కృష్ణ జబ్బు బాగా ముదిరితే లిబిడో చెడిపోతుందనీ, న్యూరోసిస్సై కూర్చుంటుందనీ అన్నారు, గుర్తుందా! అందుకనే...మీరు పొగడ్డం లేదంటున్నా......”అంటూ మళ్ళీ ప్రారంభించింది. “మాటలు అర్థాలు మనుషుల డొంకల వంకల మనసులలోబడి దారితప్పి...” అంటూ గీతాలాపన!

మెదడుకు అందని మాటలాడేవాళ్ళతో కాపరం చేసేదెట్లా?

మీరే చెప్పండి!

—:o:—